ఈనాడు
అన్నమయ్య
సోమవారం అక్టోబరు 14, 2024

పోలీసు సంక్షేమ సొసైటీలో నిధుల గోల్‌మాల్?

కడప, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు సంక్షేమ సొసైటీలో కొంతమంది ఉద్యోగులు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. సుమారు రూ.30 లక్షలకు పైగా చేతివాటాన్ని ప్రదర్శించినట్లు సమాచారం. దీనిపై ఓ డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తున్నట్లు తెలిసంది. సొసైటీలో సభ్యులుగా ఉన్న వారు ప్రతి నెలా రూ.1000 కడతారు. ఏదైనా ఇబ్బందులున్నా, మరే ఇతర కారణాలతో డబ్బులు అవసరమైన వారు సొసైటీ నుంచి తీసుకుంటారు. ఈ వ్యవహారంలోనే సొమ్ము పక్కదారి పట్టినట్లు చర్చ నడుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడితే అసలు విషయాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి.

రాయచోటిని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతాం


వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీబజార్, బండ్లపెంట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వంట నూనెల విక్రయ కేంద్రాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... నూనెల మిల్లుల యజమానులు, వ్యాపారులతో ప్రభుత్వం చర్చించి వినియోగదారులకు నిత్యావసరాలు తక్కువ ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. లీటరు సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124, లీటరు పామాయిల్ రూ.110 చొప్పున అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపారులు ఎవరైనా బెదిరించినా, లంచం అడిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి చెప్పారు. మిల్లర్ల యజమానులు ప్రభుత్వ పరంగా చట్టబద్ధంగా ట్యాక్స్ చెల్లించవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యాపారులు, తెదేపా నాయకులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కశ్మీర్ కాదు రామసముద్రం యాపిల్



యాపిల్... అంటేనే మనకు గుర్తుకు వచ్చేది కశ్మీర్, సిమ్లా కానీ అదే పంట జిల్లాలోని రామసముద్రంలో పడుతోందని తెలుసా! హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెచ్చిన హెచ్‌ఆర్‌ఎం ఎన్-99 హైబ్రిడ్ రకం యాపిల్ మిట్టఎంబాడి గ్రామానికి చెందిన రైతు లోకేశ్‌రెడ్డి సేంద్రియ పద్ధతిలోనే సాగు చేశారు. సాగు వ్యయం భరిస్తే చాలు పాతికేళ్లు కాసుల పంటే. కేవలం తోట నిర్వహణకు మాత్రమే వ్యయం చేయాల్సి వుంటుంది. నాలుగు ఎకరాలకు మొదటి ఏడాదిలో రూ.5 లక్షలు వ్యయం చేస్తే రెండో ఏడాది వచ్చిన దిగుబడితోనే పెట్టుబడి వచ్చేసింది. దిగుబడిలో నాణ్యత, రంగు, రుచి బాగా ఉండడంతో తోట వద్దకే వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. రామసముద్రం యాపిల్ పండ్లు మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మార్కెట్లకు తరలుతున్నాయి. **- న్యూస్‌టుడే, రామసముద్రం**



సోమశిల... విహంగాల కళ

సోమశిల వెనుక జలాల ప్రాంతం ప్రకృతి రమణీయతకు మరో ప్రపంచం. విదేశీ విహంగాల శోభ.. వలస పక్షుల కిలకిలరావాలు.. కువకువల అందాల అతిథులతో ఆ ప్రాంతం సందడి చేస్తోంది. ఉమ్మడి కడప-నెల్లూరు జిల్లాల్లోని వెనుక జలాలు సువిశాలమైన సురక్షిత ప్రాంతం కావడంతో ఏటా అక్టోబరు ప్రారంభం నుంచి సైబీరియా పక్షులు ఇక్కడికి విడిది కోసం వస్తుంటాయి. ఇక్కడ సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉండటంతో దశాబ్దం కాలంగా విదేశీ విహంగాల పక్షుల సంఖ్య పెరుగుతోంది. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**



రూ.25 నుంచి రూ.90కు ఎగబాకిన ధర

అన్‌సీజన్‌లోనూ లాభాలు తెచ్చిపెట్టిన పంట

టమాట రైతే రాజు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించి ముందడుగు వేసిన టమాట రైతులకు లాభాలపంట పండింది. అన్ సీజన్‌లోనూ గిట్టుబాటు ధరకంటే మెండుగా ధర పలకడంతో రైతుల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు టమాట సాగు చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వేలు ఖర్చు చేస్తే లక్షల్లో లాభాలు చూడగలుగుతున్నారు.

మన పంట దేశవ్యాప్తంగా వంట

● మదనపల్లె మార్కెట్ యార్డులో మూడు నెలల వ్యవధిలో కిలో టమాట రూ.25 నుంచి రూ.90కు ఎగబాకింది. అంతకు ముందు మే నెలలో మాత్రమే ధరలు కాస్త అటు ఇటుగా పలికాయి. ఆ తర్వాత నెల నుంచి రూ.20 తగ్గకుండా ధరలు నిలకడగా ఉన్నాయి. దీంతో రైతు కూడా నష్టాల నుంచి గట్టెక్కి, లాభాల బాట పట్టారు.

● జూన్ నెలలో రూ.40 నుంచి రూ.88లకు వరకు ఎగబాకింది. జులైలో ధర కాస్త తగ్గుముఖం పట్టినా, రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లభించింది. ఆగస్టులో రూ.20 నుంచి రూ.32 వరకు ధరపలికింది. సెప్టెంబర్ మొదటి రెండు వారాల్లో నామమాత్రంగా పలికిన ధర ఆ తర్వాత పైకి ఎగబాకి రూ.64కు చేరింది. అక్టోబర్ నెలలో రూ.64 నుంచి రూ.90లకు పెరిగింది.

అక్టోబర్ నెలలో ఇలా

తేదీ	దిగుబడి (టన్నుల్లు)	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
		(10కేజీలకు రూపాయల్లో)	
01	126	540	640
02	84	820	900
03	96	820	900
04	106	820	880
05	98	820	880

మేలో కిలో : రూ.20
జూన్ : రూ.40 నుంచి రూ.80
జులై : ధరలు తగ్గాయి
ఆగస్టు : రూ.20 - రూ.32
సెప్టెంబరు : రూ.64
అక్టోబరు : రూ.64 - రూ.90

మూడు నెలల్లో మార్కెట్‌కు వచ్చిన పంట (మెట్రిక్ టన్నుల్లో)
ఆగస్టు : 15,178
సెప్టెంబర్ : 4,024
అక్టోబరు : 1,267

ఏయే రాష్ట్రాలకు వెళ్లిందంటే...

ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు టమాట ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.

పొంచి ఉన్న తుపాను!

◆ అప్రమత్తమైన అధికార యంత్రాంగం
◆ ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఈనాడు, కడప: తుపాను అన్నమయ్య, వైయస్ఆర్ జిల్లాల వైపు దూసుకురానుంది. ఆ మేరకు విపత్తుల నిర్వహణ విభాగం కలెక్టర్లను అప్రమత్తం చేసింది. దీంతో జిల్లా స్థాయిలో పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయనే సమాచారం అందింది. ఇది తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. అల్పపీడనం ప్రభావంతో అన్నమయ్య, వైయస్ఆర్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రభావం ఉండనున్నట్లు అందిన సమాచారంతో సోమవారం రాయచోటిలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ప్రకటన జారీ చేశారు. అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు. వైయస్ఆర్ జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూములు పెట్టి విపత్కర పరిస్థితుల సమాచారాన్ని చేరవేసి సాయం పొందడానికి వీలుగా ఫోన్ నంబర్లు విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయం 08562-246344, కడప ఆర్డీవో 8985429256, జమ్మలమడుగు 9618804882, బద్వేలు 91701323862, పులివెందుల 8520082425, 9542299885 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. పురపాలక, వైద్య, ఆరోగ్యం, విద్యుత్తు, జలవనరులశాఖ, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖలు అప్రమత్తంగా ఉండాలంటూ... అధికారులు దగర పని చేసే స్థానాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



మారుతీనగర్, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రవణ నక్షత్రం, విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. దేవుడిగడపలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఒంటిమిట్టలో స్వామివారిని పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రామయ్య క్షేత్రం నుంచి శమీ దర్శనం కోసం రఘురాముడు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ తరలివెళ్లారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

నేటి నుంచి పల్లె పండగ

రూ.71 కోట్లతో 723 పనులకు శ్రీకారం


చిన్నమండెం మండలంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేసే బలిజపల్లె రోడ్డు ఇదే

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పల్లె సీమల ప్రగతి కోసం చేపట్టిన పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 501 గ్రామ పంచాయతీలలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి నిర్వహించనున్నారు. జిల్లాలో ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ అధికారులు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపగా ఉన్నతాధికారులు ఆమోదించారు.

● జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజన్లలోని 30 మండలాల్లో 723 పనులను అధికారులు గుర్తించగా రూ.71 కోట్లు మేర నిధులు విడుదలయ్యాయి. గ్రామాలలో రహదారుల ఏర్పాటు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం మెరుగుకు చేపట్టాల్సిన పనులకు అధికారులు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో భూమి పూజలు చేయనున్నారు.

హాజరు కానున్న మంత్రి మండిపల్లి.. రాయచోటి నియోజకవర్గంలో నిర్వహించనున్న పల్లె పండగ కార్యక్రమానికి రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరు కానున్నారు. 14వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు చిన్నమండెం మండలం పడమటి కోన, బలిజపల్లెలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. 9.30కు గాలివీడు మండలం అరవీడు కస్పా, 10 గంటలకు అరవీడు దళితవాడ, 10.30కి గాలివీడు టౌన్ కుమ్మరపల్లి, 11 గంటలకు అదే మండలంలోని నడింపల్లి, 11.30 గంటలకు గోరాన్‌చెరువు, 12.30 గంటలకు పూలికుంట, ఒంటి గంటకు లక్కిరెడ్డిపల్లె మండలంలోని పందిళ్లపల్లె, 1.30 గంటలకు అదే మండలంలోని కుర్నూతల వడ్డెపల్లె, 2 గంటలకు దేవళంపల్లి, కస్తూరాజుగారిపల్లిలలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేస్తారు. అదే రోజు సాయంత్రం రాయచోటి పట్టణం తిరుపతినాయుడుకాలనీలో లక్ష్మీ వృద్ధాశ్రమాన్ని మంత్రి ప్రారంభిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

మదనపల్లె జిల్లా కేంద్రం ఖాయం

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
◆ త్వరలో తీపికబురు విన్పించనున్న సర్కారు

'రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 30కి పెంచుతారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మదనపల్లె కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తాం. అయితే ఇప్పట్లో కాదు.. ఇందుకు కొంత సమయం పడుతుంది' ఇటీవల విలేకరుల ఇష్టాగోష్ఠి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, కడప

మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు ఖాయమైపోయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు పునరుద్ఘాటించారు. ఎన్నికలకు ముందు రెండుసార్లు స్పష్టమైన హామీ ఇచ్చారు. జిల్లాల ఏర్పాటు హేతుబద్ధంగా లేదని.. అధికారంలోకి వచ్చాక సమీక్షిస్తామనే హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా మదనపల్లెలో మినీ మహానాడు నిర్వహించారు. ఆ సభలో తొలిసారిగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి మదనపల్లెకు వచ్చిన చంద్రబాబు హామీని పునరుద్ఘాటించారు. ఆ తర్వాత అధికారంలోకి రావడం.. . దీనిపై మదనపల్లెతో పాటు పరిసర నియోజకవర్గ ప్రజల్లో జిల్లా ఏర్పాటుపై చర్చ సాగుతుండగా... తాజాగా చంద్రబాబు స్పష్టత ఇచ్చేశారు. త్వరలోనే జిల్లా కేంద్రంగా మదనపల్లెను ఏర్పాటు చేస్తామని.. దీంతో పాటు పోలవరం ముంపు మండలాలను ఒక జిల్లాగా, మార్కాపురం, మదనపల్లె కేంద్రంగా మరో రెండు జిల్లాలను ఏర్పాటు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో సర్దుబాటు చేస్తామంటూ వివరించారు. కానీ ఇప్పట్లో కాదని, కొన్ని రోజుల్లో చేస్తామంటూ స్పష్టతనిచ్చారు. ఈ మేరకు చూస్తే.. మదనపల్లె జిల్లా కేంద్రంగా చేస్తూ.. ఇందులో తంబళ్లపల్లె, పీలేరు, చిత్తూరు జిల్లాలోని పుంగనూరును కలుపుతూ నాలుగు నియోజవర్గాలతో జిల్లా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. మదనపల్లె జిల్లా కేంద్రం ఏర్పాటుతో అన్నమయ్య జిల్లా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకే పరిమితమై అతి చిన్న జిల్లాగా నిలిచిపోనుంది. ఇందులో ఏమైనా మార్పులుంటాయన్నది ప్రక్రియ ప్రారంభంతోనే స్పష్టత రానుంది.

4,312 అడుగుల ఎత్తులో మొసళ్లు


హార్సిలీహిల్స్‌లో పెరుగుతున్న మొసళ్లు

సముద్ర గర్భంతో పాటు నదులు, సరస్సుల్లో కన్పించే మొసళ్లు సముద్రమట్టానికి 4,312 అడుగుల ఎత్తులో ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉందా! అవీ అన్నమయ్య జిల్లాలో ఉన్నాయని మీకు తెలుసా..! కానీ ఇది నిజం. జలాల్లోనే విభిన్నంగా మనుగడ సాగించే ఈ జీవి భూమిపై మాత్రమే బతకదు. అలాంటిది ఇలాంటి ఎత్తైన ప్రాంతంలో పెంచితే ఎలా ఉంటుంది? అన్న ప్రశ్న అధికారుల్లో ఉత్పన్నమై, కొన్నాళ్లకే కొత్త ప్రయోగానికి దారి తీసింది. దీనికి బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ వేదికైంది. కొండపై మొసళ్ల పెంపకం విజయవంతమైంది. అటవీశాఖ ప్రాంగణంలో 1995లో మొసళ్ల పార్కును ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. పర్వత ప్రాంతంలో విభిన్న వాతావరణ పరిస్థితుల మధ్య ఇవి బతుకుతాయన్న నమ్మకం తొలుత ఎవరికీ లేదు. ఎలాగైనా సరే... తొలుత ప్రయోగాత్మకంగా మంచి నీటిలో మనుగడ సాగించగల మూడు మొసళ్లను పార్కులో వదిలారు. వీటి కోసం కొలనును నిర్మించారు. ఇవి బయటకు రాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా రక్షిత గోడను కట్టారు. మొసళ్ల వల్ల సందర్శకులకు ముప్పు వాటిల్లకుండా కంచె ఏర్పాటు చేశారు. రోజూ మాంసాన్ని ఆహారంగా ఇస్తూ... కొలనులో నీటిని నింపుతూ వచ్చారు. క్రమంగా మొసళ్లు కొండపై వాతావరణానికి అలవాటు పడిపోయాయి. ఐదేళ్ల క్రితం తీవ్రమైన అనారోగ్యంతో ఓ మొసలి చనిపోగా.. మరో దాన్ని తెప్పించారు. కొత్తగా పార్కులో వదలిన మొసలి జీవనం సాధారణంగా మారిపోయింది. కొండపైకి వస్తున్న సందర్శకులను మొసళ్ల పార్కు ఆకట్టుకుంటోందని, చిన్నారులు ఆసక్తిగా వీక్షిస్తూ కొత్త అంశాలను తెలుసుకుంటున్నారని హార్సిలీహిల్స్ అటవీశాఖ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు. **- న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

రూ.కోటి కాజేశారు!

★ పీలేరులో వెలుగు చూసిన అవినీతి
★ వైకాపా హయాంలో జరిగిన దందా
★ కప్పిపుచ్చే ప్రయత్నాల్లో ఉన్నతాధికారులు


పీలేరులోని విద్యుత్తు నియంత్రికల మరమ్మతు కేంద్రం



ఈనాడు, కడప, న్యూస్‌టుడే- పీలేరు గ్రామీణ

ఆవు చేలో మేస్తే.... దూడ గట్టున మేస్తుందా...? అన్న చందంగా గత వైకాపా ప్రభుత్వ పాలనలో అక్రమాలకు అంతూపొంతూ లేకుండా సాగింది. ఆ పార్టీ అధికారం కోల్పోయిన అనంతరం వివిధ స్థాయిల్లో జరిగిన అక్రమాలు.. దందాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కాలిపోయి.. తుప్పు పట్టిన తీగలు, కమ్మీల నుంచి ఎస్పీడీసీఎల్ అధికారులు దాదాపు రూ.కోటికి పైగా కాజేశారు. గత వైకాపా అయిదేళ్ల పాలనా కాలంలో ఎస్పీడీసీఎల్‌లో ఎవరికి వారు దందాలకు పాల్పడ్డారు. ఈ విభాగంలో వివిధ స్థాయిలో అక్రమాలు భారీ ఎత్తున సాగాయి. పీలేరులోని విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల కేంద్రంలో తుప్పుపట్టిన రాగి, అల్యూమినియం తీగలను భారీ స్థాయిలో పక్కదారి పట్టించినట్లు అధికారులు తేల్చారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఉన్నత స్థాయి అధికారులే విశ్వయత్నాలు చేస్తుండడం గమనార్హం.

పీలేరు కేంద్రంలో ఇలా...

పీలేరులో ఎస్పీడీసీఎల్ డీఈ కార్యాలయానికి అనుబంధంగా విద్యుత్తు నియంత్రికల మరమ్మతు కేంద్రం నడుస్తోంది. పరిసరాల్లోని 8 మండలాల పరిధిలో కాలిపోయిన నియంత్రికల మరమ్మతులు జరుగుతాయి. ఇక్కడ వాటికి మరమ్మతులు చేసి తిరిగి పంపిస్తారు. దగ్ధమైన నియంత్రికల్లో కాలిపోయిన రాగి, అల్యూమినియం తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చుతారు. నియంత్రికలు పనికి రాకుండా పోతే నిబంధనల ప్రకారం విద్యుత్తు శాఖకు అప్పజెప్పి దాని స్థానంలో కొత్తది తీసుకుంటారు. కాలిపోయిన అల్యూమినియం, రాగి తీగలు ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి ఉంటుంది. ప్రైవేటు మరమ్మతుల కేంద్రంలో అయినా ఇలాగే చేయాలి. నియంత్రికల మరమ్మతుల కేంద్రాల నిర్వాహణకు ప్రత్యేక విభాగం ఉంటుంది. ఈ విభాగంలో పర్యవేక్షణ నిమిత్తం నెలలో ఈఈ రెండు పర్యాయాలు, డీఈలు ఆరుసార్లు మరమ్మతుల కేంద్రాలను సందర్శించాలి. అక్కడ రికార్డులు నిర్వహణ, ఖర్చయిన అల్యూమినియం, రాగి తీగలు, నియంత్రికలకు వినియోగించే ఆయిల్ నిల్వలను తనిఖీలు నిర్వహించాలి.

కానరాని తనిఖీలు

నిబంధనలు ఇలా చెబుతున్నా క్షేత్ర స్థాయిలో నియంత్రికల మరమ్మతుల కేంద్రాలను సందర్శించిన దాఖలాలు లేవు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాకెందుకులే అనుకుని వాటిని గాలికి వదిలేస్తున్నారు. దీంతో నియంత్రికల మరమ్మతుల కేంద్రంలో అడిగే వారు లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు ఈ తరహా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

రూ.కోటి వరకు అవినీతి

పీలేరు నియంత్రికల మరమ్మతుల కేంద్రంలో అధికారులు కుమ్మక్కై రూ.కోటి విలువైన రాగి, అల్యూమినియం తీగలు కాజేసినట్లు విచారణలో ఆలస్యంగా తేలింది. తీగలను చెన్నైలో విక్రయించినట్లు తేల్చారు. ఇదే విషయం బయటకు పొక్కకుండా ఉన్నతాధికారులు పడరాని పాట్లు పడుతున్నట్లు పడుతున్నారు. తీగలు రికవరీ చేయడానికి సంబంధిత అధికారులు చెన్నైకి వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు తాజాగా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ వ్యవహారం సర్కిల్ పరిధిలో సంచలనంగా మారింది.

మద్యం దుకాణాలకు నేడు లాటరీ

ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభం

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో ఉన్న అజయ్ కల్యాణ మండపంలో ఈ ఏర్పాట్లు చేశామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 7.30 గంటలకే కల్యాణ మండపం వద్దకు చేరుకోవాలన్నారు. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన పాస్‌లు, ఆధార్, అప్లికేషన్ జిరాక్స్ వంటి ఆధారాలతో అక్కడికి రావాలన్నారు. పాసులు కలిగిన వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తొలి లాటరీ తీసి ఫలితాన్ని ప్రకటిస్తారన్నారు. జిల్లాలోని 111 మద్యం దుకాణాలకు 2,160 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు.

బియ్యం పత్రం రూపు మారుతోంది

త్వరలో కొత్తగా రేషన్ కార్డులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు కొత్త బియ్యం పత్రాలివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ముమ్మరంగా కసరత్తు సాగుతోంది. మార్గదర్శకాల తయారీలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. గత వైకాపా పాలనలో మాజీ సీఎం వైఎస్ఆర్‌తో పాటు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో పాటు ఆ పార్టీ రంగులతో ముద్రించిన పత్రాలిచ్చారు. వీటి స్థానంలో నూతనంగా తయారు చేయించి ఇవ్వాలని ఇటీవల ఉన్నత స్థాయిలో చర్చించారు. అన్నమయ్య జిల్లాలో చౌక ధరల దుకాణాలు 1,123 ఉన్నాయి. మొత్తం బియ్యం కార్డులు 5,04,824 ఉండగా అందులో సభ్యులు 15,13,519 మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత పథకంలో అంత్యోదయ అన్న యోజనలో 39,563 పత్రాలు (1,12,246 యూనిట్లు), బియ్యం కార్డులు 4,11,154 (12,76,871 యూనిట్లు) ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కోటాలో ఏఏవై 669 (1,001 యూనిట్లు), రేషన్ కార్డులు 53,438 (1,23,391 యూనిట్లు) అందజేశారు. గత అయిదేళ్ల (2019-2024) జగన్‌రెడ్డి జమానాలో కార్డుదారులకు అవస్థలు తప్పలేదు. వేలాది మంది రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారుల గోడును గత వైకాపా ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. పేద, బడుగుజీవులు, బీపీఎల్ కింద ఉన్న మధ్య తరగతి వర్గాలకు కీలకమైన రేషన్‌కార్డు సమస్యలకు పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

ఖాళీ జాగా... కనిపిస్తే పాగా

◆ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవు
◆ రూ.కోట్ల విలువైన స్థలాలపై అక్రమార్కుల కళ్లు
◆ గున్నికుంట్ల రోడ్డులో అప్పన్నకుంట స్థలం కబ్జా


గున్నికుంట్ల రోడ్డులో చదును చేసిన ప్రభుత్వ స్థలం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవవుతోంది. ఖాళీ జాగా కనిపిస్తే ప్రభుత్వ స్థలాలను ఆర్థిక, అంగబలం కలిగిన వారు ఆక్రమించేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రోడ్డులో ఉన్న అప్పన్నకుంట స్థలం ఆరు ఎకాలకు పైబడి ఉంది. ఈ స్థలంలోనే హిందూ శ్మశాన వాటిక ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో ఈ స్థలాలపై కబ్జాదారుల కళ్లుపడ్డాయి. శ్మనాన స్థలాన్ని ఆక్రమించేసి చదును చేశారు. అప్పట్లో అధికారులు అడ్డుకున్నా అధికార బలం ముందు ఏమీ చేయలేకపోయారు.

రహదారి పక్కనే ఆక్రమణకు యత్నం

గున్నికుంట్ల రోడ్డు సైడు ఉన్న కుంట స్థలాన్ని ఇటీవల కొందరు ముళ్లపొదలు తొలగించారు. వృథా మట్టి తోలి చదును చేశారు. కుంట కట్టను స్థిరాస్తి వ్యాపారులు తవ్వేసి రహదారిని ఏర్పాటు చేశారు. దాని పక్కనే తాజాగా మళ్లీ ఆక్రమణకు తెరలేపారు. గతంలో ఈ ప్రాంతంలో దోబీఘాట్ ఉండేది. బోరు, తొట్టెలను అప్పట్లో నిర్మించారు. వాడుకలో లేకపోవడంతో అవి నేడు నిరుపయోగంగా ఉన్నాయి. ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించి కుంటలోనే రాతి కూసాలు పాతారు. ఇక్కడ సెంట్ స్థలం కొనుగోలు చేయాలన్నా రహదారిపైకి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ధర పలుకుతోంది. రూ.కోట్లు విలువైన ఆరు ఎకరాల స్థలాన్ని అధికారులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులకు స్థానచలనం కలిగి కొత్త వారు వచ్చి విధుల్లో చేరారు. కానీ క్షేత్ర స్థాయిలో జరిగే అక్రమాలు, ఆక్రమణలపై పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోందని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పన్నకుంట స్థలాన్ని కాపాడి ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వాధీనం చేసుకుంటాం - రంగస్వామి, ఆర్డీవో, రాయచోటి

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం. అప్పన్నకుంట స్థలాన్ని గతంలోనే సర్వే చేయించాం. ఈ స్థలాన్ని పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమిత స్థలాన్ని గుర్తించి స్వాధీన పరుచుకుంటాం.

భర్త కిడ్నాప్‌... భార్య ఆత్మహత్య

న్యూస్‌టుడే, రాపూరు



చెంచులక్ష్మి (పాతచిత్రం)

భర్తను వ్యాపారి కిడ్నాప్‌ చేయడం.. ఎంత వేడుకున్నా వదిలి పెట్టకపోవడంతో భార్య చెంచులక్ష్మి(30) శనివారం రాపూరు మండలం గిలకపాడు రోడ్డు వద్ద గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త రవి(అలియాస్‌ డేవిడ్‌) రాపూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సిమెంట్‌ రాళ్ల వ్యాపారి వెంకటసుబ్బారెడ్డి భర్త రవిని బలవంతంగా కిడ్నాప్‌ చేసి తీసుకెళ్లారు.. ఎంత వేడుకున్నా వదిలిపెట్టలేదు. జీవితంపై విరక్తి చెంది గుళికలు తీసుకుంది. చికిత్స నిమిత్తం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గూడూరు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందారు. దీనిపై ఎస్‌ఐ రాజేశ్‌ మాట్లాడుతూ... తిరుపతి జిల్లా డక్కిలి మండలం దందోలుకు చెందిన చెంచులక్ష్మి ఆమె భర్త రవి మధ్య తలెత్తిన వివాదమే ఆత్మహత్యకు కారణమన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సుబ్బారెడ్డి సిమెంట్‌ రాళ్ల తయారీ పని కోసమని దంపతులను ఇరవై రోజుల క్రితం తీసుకెళ్లారు. రవి యజమాని వద్ద రూ.76 వేలు తీసుకొని రూ.20 వేలు చెల్లించారు. సెప్టెంబరులో అక్కడి నుంచి వారిద్దరు గిలకపాడుకు వచ్చారు. వెంటనే సుబ్బారెడ్డి వచ్చి భర్తను మాత్రమే బలవంతంగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో రవి తన భార్యకు ఫోన్‌ చేసి దసరా పండగకు రమ్మని పిలిచారు. నువ్వు రాకపోతే నిన్ను చంపేస్తానని బెదిరించడంతో భర్త ఫోన్‌ చేసి ఇప్పుడు వద్దని చెప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కూల్‌ గేమ్స్‌ షెడ్యూల్‌ విడుదల

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ నెలలో నిర్వహించనున్న క్రీడా పోటీల షెడ్యూల్‌ను స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) కార్యనిర్వాహక కార్యదర్శి వసంతవాణి ఆదివారం విడుదల చేశారు. క్రీడాంశాలు, తేదీ, వేదికల వివరాలిలా ఉన్నాయి.

- 14న అండర్‌-17 ఫెన్సింగ్‌ పోటీలు-జడ్పీ ఉన్నత పాఠశాల యాదమరి
- 15న.. అండర్‌-14, అండర్‌-17 ఆర్చరీ- ఐజాక్‌ టైల్స్‌, మంగళం రోడ్డు తిరుపతి. అండర్‌-17 జూడో, అండర్‌-14, అండర్‌-17 టెన్నీ కాయిట్‌, అండర్‌-14, అండర్‌-17 రైఫిల్‌ షూటింగ్‌-శ్రీనివాసా స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌(తిరుపతి), అండర్‌-14 ఫెన్సింగ్‌-జడ్పీహెచ్‌ఎస్‌ సిద్ధంపల్లె(చిత్తూరు మండలం), అండర్‌-17 క్రికెట్‌-ఎస్‌వీఆర్‌ జీహెచ్‌ఎస్‌-పుత్తూరు
- 17న.. అండర్‌-14 ఫుట్‌బాల్‌-అపోలో ఇషా విద్యాలయ-అరగొండ, అండర్‌-14, అండర్‌-17 బాస్కెట్‌బాల్‌, అండర్‌-17 ఖోఖో-డీపీఎస్‌ (గ్రౌండ్‌(చిత్తూరు), అండర్‌-14, అండర్‌-17 యోగా-బాలుర జడ్పీహెచ్‌ఎస్‌(శ్రీకాళహస్తి), అండర్‌-14 షటిల్‌ బ్యాడ్మింటన్‌-జీపీ స్పై పిట్‌-తిరుపతి, సాఫ్ట్‌ టెన్నిస్‌-బాలుర జడ్పీహెచ్‌ఎస్‌-శ్రీకాళహస్తి
- 18న.. అండర్‌-17 షటిల్‌ బ్యాడ్మింటన్‌-జీపీ స్పై పిట్‌(తిరుపతి), అండర్‌-14 హ్యాండ్‌బాల్‌-జడ్పీహెచ్‌ఎస్‌ సిద్ధంపల్లె(చిత్తూరు మండలం), అండర్‌-14 ఖోఖో-జడ్పీహెచ్‌ఎస్‌ పుంగనూరు
- 19న.. అండర్‌-17 కబడ్డీ-జడ్పీహెచ్‌ఎస్‌ చౌడేపల్లె, అండర్‌-14 బాల్‌బ్యాడ్మింటన్‌-జడ్పీహెచ్‌ఎస్‌ మహల్‌, కలికిరి. అండర్‌-14, 17 చెస్‌-శ్రీనివాసా స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌-తిరుపతి
- 22న.. అండర్‌-14 హాకీ పోటీలు-ప్రభుత్వ ఉన్నత పాఠశాల-చంద్రగిరి
- 26న అండర్‌-17 రెజ్లింగ్‌-జడ్పీహెచ్‌ఎస్‌-యాదమరి, అండర్‌-14, అండర్‌-17 టేబుల్‌ టెన్నిస్‌-బృందావన్‌ పాఠశాల సంతపేట(చిత్తూరు), అండర్‌-14 వాలీబాల్‌-జడ్పీహెచ్‌ఎస్‌ మదనపల్లె
- 28న.. అండర్‌-14, అండర్‌-17 సైక్లింగ్‌-జడ్పీహెచ్‌ఎస్‌ పూతలపట్టు, అండర్‌-14, అండర్‌-17 రూబీ-ప్రభుత్వ ఉన్నత పాఠశాల-సత్యవేడు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండు



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ

రాయచోటి, న్యూస్‌టుడే: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి. రమణ పేర్కొన్నారు. పట్టణంలోని డైట్‌ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అడిషనల్‌ క్వాంటమ్‌ పెన్షన్‌ పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం పెన్షనర్లకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. 2024 పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వారిని సభ్యులుగా చేర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, రెడ్డెన్న, రెడ్డికుమార్‌ పాల్గొన్నారు.

చామంతి విత్తు... నాలుగు రాష్ట్రాలకు సొత్తు

విస్తరిస్తున్న పూల నారు ఎగుమతులు

విత్తన తయారీ కేంద్రంగా వాల్మీకిపురం

రాయలసీమలోని పశ్చిమ ప్రాంతంలో వరుస కరవులు... కష్టాలతో చితికి పోయిన ఆ రైతు నాడు సాగు చేయాలంటే విత్తనం ఎక్కడ కొనాలో నని వెతికేవారు. నేడు అదే రైతు వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి తనే ఇతరులకు విత్తన సరఫరాదారుగా మారారు. అదేదో పక్క ఊరు, జిల్లాకు అనుకుంటే పొరపాటే దక్షిణాదిన నాలుగు రాష్ట్రాలకు విత్తనం అందించే గ్రామంగా అది పేరొందింది. వ్యవసాయం చేసే రైతు పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏకంగా 300 ఎకరాల్లో నాణ్యమైన, దృఢమైన పూల విత్తనాలను అందించే స్థాయికి ఎదిగారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు ఈ పూల విత్తన నారులను ఎగుమతి చేస్తున్నారు. ఆ ఆదర్శ రైతు, రాష్ట్ర ఉత్తమ రైతు పురస్కార గ్రహీత శంకర్‌రెడ్డి.



పాలీహౌస్‌లో విత్తనాలకు చామంతి కొమ్మలను కోస్తున్న కూలీలు



నాణ్యమైన చామంతి నారును చూపుతున్న వ్యవసాయ కూలి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన రైతు శంకర్‌రెడ్డి తన సొంత వ్యవసాయ క్షేత్రంలో రైతు పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేసుకుని వ్యవసాయంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి నుంచి కొత్తకొత్త రకాల పూల వంగడాలను దిగుమతి చేసుకోవడం ద్వారా తన రెండెకరాల భూమిలో పాలీహౌస్‌లను ఏర్పాటు చేసుకుని అందులో వెలుతురు సహాయంతో నాణ్యమైన చామంతి పూల రకాల నారును ఉత్పత్తి చేస్తున్నారు. ముఖ్యంగా సెంట్‌ ఎల్లో, సెంట్‌ వైట్‌, పూర్ణిమ ఎల్లో, పూర్ణిమ వైట్‌, బుల్లెట్‌, హైదరాబాదు వైట్‌, ఎల్లో, రెడ్‌, పింక్‌ రకాల చామంతి విత్తనాలను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. తన పరిసర ప్రాంత రైతులకు నాణ్యమైన దృఢమైన విత్తన నారును అందించడమే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ మండలాల రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని ఈ ప్రాంతం నుంచి పూల నారును సరఫరా చేస్తూ లాభాలబాటన పయనిస్తున్నారు. ఇలా ఏటా నాలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులకు దాదాపు 300 ఎకరాలకు పైగా పూల విత్తన నారును ఎగుమతి చేస్తున్నారు. తన సొంత పాలీహౌస్‌లో ఏడాది పొడవునా 20 మంది కూలీలకు ఉపాధిని కల్పిస్తున్నారు. రోజుకు ఒక్కో కూలీకి రూ.400 చొప్పున కూలి అందిస్తున్నాడు. వీరితో పాటు మరో నాలుగు కుటుంబాలకు ఉపాధినిస్తున్నారు. తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే దంపతులకు నెలకు ఒక్కో జంటకు రూ.20 వేలు జీతం ఇస్తూ ఇలా నాలుగు జంటలకూ ఉపాధిని కల్పిస్తున్నారు. తన పొలంలో వేసిన పాలీహౌస్‌ ద్వారా ప్రతి ఏటా 30 లక్షల నారు విత్తనాన్ని తయారు చేస్తున్నారు. ఒక్కో మొలకను 80 పైసలు నుంచి రూ.2 వరకు అమ్మకం సాగిస్తారు. ఇలా ఏటా దాదాపు రూ.40 లక్షల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇందులో 50 శాతానికి పైగా ఖర్చులు పోగా మిగతాది ఆదాయంగా లభిస్తోంది. తన సొంత ఆదాయంతో పాటు ఓ 30 మంది కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తున్నారు. వ్యవసాయంలో వరుస నష్టాలను పక్కకు నెట్టి వినూత్న ఆలోచనలతో ఆదాయం ఎలా సాధించాలో చూపుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు రైతు శంకర్‌రెడ్డి.

రైతులకు మంచి ఆదాయం



పాలీహౌస్‌లో విద్యుత్తు వెలుగుల ద్వారా రాత్రి సమయాన్ని తగ్గించి పగలు (వెలుతురు) ఎక్కువ సమయం ఇవ్వడం ద్వారా పూలనారును ఉత్పత్తి చేస్తున్నాం. చీడపీడల బారిన పడకుండా నాణ్యమైన, దృఢమైన విత్తన నారును అందించడంతో పాటు మొలక నాటిన రోజు నుంచి రెండు నెలల వరకు మొక్క కుంటుపడకుండా ఏపుగా పెరగడంతో పాటు మొక్క కాండాలు బలంగా తయారై ఎక్కువ శాతంలో మొగ్గలు రావడం ద్వారా ఎక్కువ దిగుబడి వస్తుంది. తద్వారా మార్కెట్‌లో డిమాండును బట్టి రైతుల మంచి ఆదాయం పొందవచ్చు.

- శంకర్‌రెడ్డి, రాష్ట్ర ఉత్తమ రైతు పురస్కార గ్రహీత, అయ్యవారిపల్లె, వాల్మీకిపురం మండలం

వీరభద్రుడికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



వీరభద్రస్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామికి విజయదశమిని పురస్కరించుకుని శనివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా వారికి అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరభద్రస్వామి, భద్రకాళీ దేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో అధికారులు, అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో వెంకటరమణారెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, కోడి శ్రీనివాసులురెడ్డి, పి.మదన్‌మోహన్‌రెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయాల్లో ఆయుధ పూజలు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ చేస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్‌, అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో విజయదశమిని పురస్కరించుకుని శనివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో డీఎస్పీ కృష్ణమోహన్‌ నిర్వహించారు. పోలీసులు దైనందిన విధుల్లో వినియోగించే ఆయుధాలకు, వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలకు, పోలీసు విభాగంలోని వివిధ వాహనాలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని ప్రార్థించారు. రాయచోటి పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్‌, పోలీసు సిబ్బంది ఆయుధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ టి.వి.సత్యనారాయణ, ఆర్‌ఎస్సై జి.రవి, ఏఆర్‌ ఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, కుప్పుస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రెడ్డిశేఖర్‌ (పాత చిత్రం)

రామసముద్రం, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన నారిగాని పల్లె పంచాయతీ ఎగువలంబంవారిపల్లెలోని బెరికీలుగుట్టలో ఆదివారం చోటు చేసుకుంది. చెంబకూరు పంచాయతీ కాటేవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్‌ (26) ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో నారిగానిపల్లె వైపుగా వెళ్లారు. అతడికి ఎగువలంబంవారిపల్లెకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆ మహిళ వ్యవసాయ పొలానికి సమీపంలోని గుట్టలో మధ్యాహ్న సమయానికి యువకుడు శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహంపై ఎలాంటి రక్తగాయాలు లేకపోవడంతో ఎవరైనా హత్య చేశారా లేక ఇతర కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని మదనపల్లె గ్రామీణ సీఐ రమేష్‌ పరిశీలించారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మదనపల్లెలో క్వారీ కార్మికుడు...

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తమిళనాడుకు చెందిన కార్మికుడు క్వారీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తమిళనాడు రాష్ట్రం అర్కాటుకు చెందిన శేషాద్రి (50) రెండేళ్లుగా వలసపల్లె క్వారీలో కూలీ పనులు చేసేవారు. శనివారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో తోటి కార్మికులు ఆయనను హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. శేషాద్రి అనారోగ్యంతో మృతి చెందాడా.. లేక ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చెన్నైలో వివాహిత ఆత్మహత్య

ములకలచెరువు, న్యూస్‌టుడే : చెన్నైలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పెద్దమండ్యం మండలం పాపేపల్లికి చెందిన గీతా (24)కు రెండున్నరేళ్ల కిందట ములకలచెరువు మండలం కుటాగోళ్లపల్లికి చెందిన ప్రకాశ్‌తో వివాహమైంది. ప్రకాశ్‌ చెన్నైలోని ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటంతో ఏడాదిన్నరగా కుటుంబంతో కలిసి చెన్నైలో ఉంటున్నారు. ఈ క్రమంలో గీతా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. గీతాకు 11 నెలల కుమారుడు ఉన్నాడు. చెన్నైలోని మాధవరం పోలీస్‌స్టేషన్‌లో గీతా తండ్రి నరసింహులు ఫిర్యాదు చేశారు.



రాజంపేటలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో వాసవీకన్యకా పరమేశ్వరీదేవి



రాయచోటిలో శమీ దర్శన శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

అంబరాన్నంటిన దసరా సంబరాలు



ములకలచెరువులో వాసవీ మాతకు వెండికవచాలంకృత సేవ



రాయచోటి : విజయ లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన భద్రకాళీ అమ్మవారు

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం విజయ దశమిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విజయలక్ష్మీదేవి ఆలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయం, గాంధీబజార్‌లోని కన్యకాపరమేశ్వరీ, శివాలయం కూడలిలోని ఉమామహేశ్వరస్వామి, కె.రామాపురంలోని చౌడేశ్వరీదేవి, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయాలలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. వీరభద్రాలయంలో శమీ వృక్ష దర్శనం కోసం అమ్మవారు సతీసమేతంగా ఊరేగింపుగా వచ్చారు. ఆర్యవైశ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి శోభాయాత్ర నిర్వహించారు. పలు చోట్ల పుష్ప పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, అన్నమయ్య జిల్లా బృందం



వాల్మీకిపురంలో నవధాన్యాల అలంకరణలో వాసవీ అమ్మవారు

ఉపాధ్యాయులకు పెండింగ్‌ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సర్వీసు మొత్తం ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్‌ లోన్లు, ఏపీజీఎల్‌ఐ రుణాలు, ఫైనల్‌ పేమెంట్స్‌, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపుల్లో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. పిల్లల చదువులకు, ఇంటి నిర్మాణానికి, వివాహాల కోసం దాచుకున్న డబ్బు ఉపయోగపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. పెడింగ్‌లో ఉన్న మెడికల్‌ బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండు చేశారు. యూనియన్‌ నాయకులు రవీంద్రనాథరెడ్డి, మురళీకుమార్‌, సుధాకర్‌, రామాంజులు, గోపికృష్ణ, రెడ్డెయ్య, నాగరాజు, శివశంకర్‌ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సిరివెళ్ల ఎడ్లకు ప్రథమ స్థానం



అట్లూరు క్రాస్‌ రోడ్డులో బండలాగుతున్న ఎడ్లు

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు క్రాస్‌రోడ్డులోని అవధూత అబ్బిరెడ్డి స్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జాతీయస్థాయి ఒంగోలుజాతి వృషభరాజాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపరమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి (కేఆర్‌బీఆర్‌) ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.70,116 అందజేశారు. ద్వితీయ స్థానంలో మైదుకూరుకు చెందిన వెంకటేష్‌ యాదవ్‌ ఎడ్లు నిలవగా రూ.50,116 దక్కాయి. తృతీయ స్థానంలో వైఎంఆర్‌ కాలనీ ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి ఎడ్లకు రూ.30,116 దక్కాయి. బండలాగుడు పోటీలను ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బొజ్జా రోశన్న, తెదేపా నాయకులు సూర్యనారాయణరెడ్డి, నందగోపాల్‌రెడ్డి, రెడ్డయ్య, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు విజయమ్మ అబ్బిరెడ్డి మఠంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఖో అంటే పతకమే!

జాతీయ స్థాయి పోటీల్లో దేవళంపల్లె యువకుడి సత్తా

– న్యూస్‌టుడే, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె

క్రీడా ప్రతిభను పేదరికం ఆపలేకపోయింది. మారుమూల పల్లెలో జన్మించినా చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. ఖోఖో క్రీడపై మక్కువతో నిరంతరం సాధన చేశారు. పట్టుదలతో ముందుకెళ్లారు. కూత పెట్టిన ప్రతి చోట పతకం సాధించి అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయన ఆయనే లక్కిరెడ్డిపల్లె మండలం దేవళంపల్లెకు చెందిన నాగార్జున.



దిల్లీలో నిర్వాహకుల నుంచి ఉత్తమ క్రీడాకారుడి పురస్కారాన్ని అందుకుంటున్న నాగార్జున

- నాగార్జునకు క్రీడలంటే చిన్నప్పటి నుంచి మక్కువ. స్వగ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలోల పదో తరగతి వరకు చదివారు. పాఠశాల స్థాయిలోనే క్రీడలల్లో రాణిస్తూ వచ్చారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6న దిల్లీలో జరిగిన యూత్‌ గేమ్‌ కౌన్సిల్‌ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఖోఖో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతగా నిలిచారు. బెస్ట్‌ స్పోర్ట్స్‌ అవార్డు దక్కించుకున్నారు. గతంలో దేవళంపల్లి ఉన్నత పాఠశాల నుంచి విజయనగరం, గుంటూరు, గూడూరు, శ్రీకాకుళం, ప్రకాశం, దోమలగూడ, తిరుపతి ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటారు. జూనియర్‌ కళాశాలల విభాగంలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లోనూ సత్తా చాటారు. యోగివేమన యూనివర్సిటీ నుంచి మూడు పర్యాయాలు సౌత్‌ జోన్‌ నేషనల్‌ పోటీల్లో పాల్గొన్నారు. ప్రొద్దుటూరులోని రాయలసీమ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల నుంచి బెంగళూరు, చెన్నై, కేరళలలో జరిగిన సౌత్‌ జోన్‌ ఖోఖో పోటీలలో పాల్గొన్నారు. 2023లో యూత్‌ గేమ్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా తరఫున నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్‌ ఖోఖో పోటీలకు హాజరై ఓటమి చెందారు. యూత్‌ గేమ్స్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా తరఫున గోవాలో జరిగిన ఖోఖో పోటీలలో పాల్గొని విజేతగా నిలిచారు. 2023లో రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్‌ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి రూ.60 నగదు బహుమతి సొంతం చేసుకున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

నాగార్జున కుటుంబం పేదరికంతో కొట్టుమిట్టాడుతోంది. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నా ఆయనకు తగిన ప్రోత్సాహం లభించలేదు. స్నేహితుల చేయూతతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ వస్తున్నారు. తల్లి పక్షవాతంతో మంచంలో ఉండగా తండ్రి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని క్రీడాభిమానులు కోరుతున్నారు.

దేశం గర్వించే స్థాయికి వెళ్లాలనేదే ధ్యేయం



చిన్నప్పటి నుంచి ఖోఖో క్రీడంటే చాలా ఇష్టం. మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో నా స్నేహితులు అన్ని విధాలా ప్రోత్సహిస్తూ వచ్చారు. పాఠశాల, కళాశాల స్థాయిలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. దేశం గర్వించే స్థాయికి వెళ్లడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నా. ప్రపంచ కప్పు పోటీల్లో పాల్గొని విజేతగా నిలవాలన్నదే లక్ష్యం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ముందుకెళ్తాం.

- ఆకుల నాగార్జున, ఖోఖో క్రీడాకారుడు

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె



లోహిత్‌ను సత్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

నీట్ ఉత్తమ ర్యాంకరుకు సన్మానం

పీలేరు, న్యూస్‌టుడే : నీట్‌లో 1,011 ర్యాంకు సాధించిన పోతంశెట్టి లోహిత్‌ను ఆదివారం పీలేరులో బలిజ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. లోహిత్ పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకు సాధించారని, విద్యార్థులు అతడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పోకల తాతయ్య, పసల చంద్రమౌళి, వంగిమళ్ల రామచంద్ర, పగడాల రామ్మోహన్, రామిశెట్టి మనోహర్, ఇమ్మడి శ్రీనివాసులు, రాము, రమేష్ పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ర్యాలీ

కలికిరి : మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లింలు డిమాండు చేశారు. మహమ్మద్ ప్రవక్త, ఖురాన్‌పై ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యతి నర్సింగ్ నంద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జమాయత్- ఉలేమా - ఏ హింద్ జిల్లా కార్యదర్శి ముస్తఫా హజరత్ ఆధ్వర్యంలో కలికిరి జామియా మసీదు నుంచి బస్టాండు మీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఎమ్మెల్యే దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యలు

పీలేరు గ్రామీణ : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎంప్లాయిస్, ఎన్ఎంయూ విఫలమయ్యాయని పీలేరు ఆర్టీసీ డిపో టీఎన్‌టీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి నగిరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. కండక్టర్లు, డ్రైవర్ల విధుల చార్టు విషయం, కార్మికుల మొండి బకాయిలు, బస్సుల కండిషన్, తిరుపతి మార్గంలో సర్వే నిర్వహించి కచ్చితమైన సమయం కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవన్నారు. వీరి సమస్యలు విన్న ఎమ్మెల్యే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిపో యూనియన్ అధ్యక్షుడు వలి, సురేంద్ర, రమణ, ఈశ్వరయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ



అంత్యక్రియల్లో పాల్గొన్న సీఐ చాంద్‌బాషా, ముస్లిం సోదరులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనారోగ్యంతో మృతి చెందిన ఓ వ్యక్తికి మదనపల్లె ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం మురగమలకు చెందిన వేణు (50) కొంతకాలంగా మదనపల్లెకు వచ్చి బెంగళూరు బస్టాండులో హమాలీగా పనిచేస్తున్నారు. ఆదివారం స్థానికంగా బెంగళూరు బస్టాండు సమీపంలో అనారోగ్యంతో మృతి చెందారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువులకు ఫోన్ చేసి వేణు చనిపోయిన విషయాన్ని తెలియజేశారు. అయితే వారు కూడా పేదవారు కావడంతో తాము అంత్యక్రియలు చేయలేమని చెప్పారు. దీంతో సీఐ దగ్గరుండి స్థానిక ముస్లిం సోదరుల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

కూలిన వృక్షం... ట్రాఫిక్‌కు అంతరాయం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో శనివారం వేకువన భారీ గాలుల తీవ్రతకు ఘాట్‌రోడ్డులోని గంగోత్రి చెరువు వద్ద చెట్టు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న తహసీల్దారు మహమ్మద్ అన్సారీ సంఘటనా స్థలానికి చేరుకుని అటవీ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకారంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన ఆలయ కమిటీ సభ్యులు

నీరుగట్టువారిపల్లె (మదనపల్లె అర్బన్), న్యూస్‌టుడే : చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఆవరణలో విద్యార్థులకు ఆయన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పురాణం చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి బండి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో శ్రీనివాస సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి, వైద్యులు జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : మండలంలోని మారెళ్లకు చెందిన శ్రీనివాసులు (56) రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు వారం రోజుల కిందట పీలేరుకు వెళుతుండగా వగళ్లకు సమీపంలో కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను తిరుపతికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన రామచంద్ర (55) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. ● మదనపల్లె పట్టణంలోని శేషప్పతోటకు చెందిన కిషోర్ (32) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై హార్సిలీహిల్స్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది ఆయనను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

బి.కొత్తకోట: బి.కొత్తకోట పట్టణ శివారు బెంగళూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడినట్లు ఏఎస్ఐ బొజ్జానాయక్ తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన సుదర్శన్ (23) తన స్నేహితులు కల్యాణ్, గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బీరంగి నుంచి బి.కొత్తకోట వైపునకు వెళుతుండగా పీటీఎం మండలం ముంతపోగులపల్లెకు చెందిన శంకర్ అనే వ్యాపారి ద్విచక్రవాహనంపై వెళుతూ ఢీకొట్టారు. దీంతో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ములకలచెరువు: లారీ ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మండలానికి చెందిన బాషా సాహెబ్ (72) శనివారం సొంత పనిపై బస్టాండుకు వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా కదిరి నుంచి వేగంగా వచ్చిన లారీ ఆయనను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కార్లు ఢీ... తప్పిన ప్రమాదం

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులోని రేనుమానుమలుపు సమీపంలో శనివారం సాయంత్రం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరు, మదనపల్లెకు చెందిన రెండు కార్లలో పది మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఘాట్‌రోడ్డు మలుపులపై డ్రైవర్లకు అవగాహన లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ ఠాణావడ్డిపల్లె సమీపంలో ఆదివారం జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై బాలకృష్ణ ఆదివారం తెలిపారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భవితకు శిక్షణ... ఉపాధికి నిచ్చెన

అవకాశాలు అందిపుచ్చుకుంటున్న యువత

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : నేటితరం యువత ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. అరుదుగా వచ్చే అవకాశాలను జారవిడచకుండా అందిపుచ్చుకుంటున్నారు పీలేరుకు చెందిన సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు. కళాశాల యాజమాన్యం ఇతర రాష్ట్రాల నుంచి వివిధ సంస్థల యాజమాన్యాలను రప్పించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. సాధారణ డిగ్రీతో ఉద్యోగాలు పొంది మంచి వేతనాలు అందుకునే అవకాశాలను దక్కించుకుంటున్నారు. ఏడాదికి రూ.లక్షల్లో వేతనం పొందే అవకాశాలను దక్కించుకున్న వీరు వచ్చే జూన్‌కు ఉద్యోగాల్లో చేరేందుకు నియామక పత్రాలు అందుకున్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జీవితంలో స్థిరపడేందుకు మార్గం



చదువుకునే రోజుల్లో ఉద్యోగావకాశాలు రావడం అదృష్టంగా భావిస్తున్నా. తల్లిదండ్రులపై ఆధారపడకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగంలో చేరి జీవితంలో స్థిరపడాలనేదే నా లక్ష్యం. డిగ్రీ తృతీయ సంవత్సరంలోనే బెంగళూరు ఫస్ట్ సోర్స్ సంస్థలో ఉద్యోగం సాధించాను. **- తన్మయి, డిగ్రీ విద్యార్థిని**

భవిష్యత్తుకు బాటలు




డిగ్రీ కోర్సులతో ఉద్యోగావకాశాలు లభించవు అనుకోకుండా ఉద్యోగమే లక్ష్యంగా గట్టి ప్రయత్నం చేశాను. బెంగుళూరుకు చెందిన ఫస్ట్ సోర్స్ సంస్థలో అవకాశం వచ్చింది. మంచి వేతనంతో కూడిన ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తుకు బాటలు వేసుకుంటా. **- భార్గవి**

అవకాశాలను కల్పించుకుంటా



ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు మెండుగా ఉంటాయని అనేక సంస్థలు ఇప్పుడు కళాశాలలకు కదిలి వస్తున్నాయి. వారైతే అన్ని రకాలుగా ఒత్తిడులను అధిగమించి ఉద్యోగాల్లో ఉత్తమ పనితీరు కనబరుస్తారని ఇటీవల పలు సర్వేలు తేల్చాయి. పీలేరు లాంటి ప్రాంతానికి కూడా ఇలాంటి అవకాశం రావడం సంతోషంగా ఉంది. **- రెడ్డివిశాల్**

తల్లిదండ్రులపై ఆధారపడకుండా



డిగ్రీ చదువుకునే సమయంలోనే మాకు ఉపాధి అవకాశాలు రావడం అదృష్టంగా భావిస్తున్నాం. తల్లిదండ్రులపై ఆధారపడే అవసరం లేకుండా జీవితంలో స్థిరపడేందుకు అవకాశం లభించింది. సర్కారు కళాశాల విద్యార్థులకు వరం. **- రెడ్డిశేఖర్**

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

?: మదనపల్లె గ్రామీణ మండలం కొత్తిండ్లు పంచాయతీ రంగారెడ్డికాలనీలో ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు, కాలువల్లో గడ్డి పెరిగిపోయింది. మురుగుకాలువలు శుభ్రం చేయాలి.
- మహమ్మద్ అర్షాన్, రంగారెడ్డికాలనీ

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చూస్తాం.
- ఆనంద్, సచివాలయ కార్యదర్శి

?: సీటీయం పెద్దచెరువులో చెత్తాచెదారం వేస్తున్నారు. ఇళ్ల నుంచి పూర్తిస్థాయిలో తడిపొడి చెత్త సేకరించడం లేదు. దీంతో నీరు కలుషితమవుతుంది. **- నరసింహులు, సీటీయం**


✔: ఇంటింటా చెత్తసేకరణ చేపట్టి సమస్య లేకుండా చూస్తాం.
- నాగరాజు, డీఎల్‌పీవో, మదనపల్లె

?: నేతాజీకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. **- వెంకటరమణ, సీటీయం రోడ్డు**

✔: మరమ్మతులు చేపట్టి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

సమస్యల పరిష్కారానికే పల్లె పండుగ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే సోమవారం నుంచి పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం తన నివాసం వద్ద రామసముద్రం మండలం తెదేపా నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందన్నారు. స్థానిక సంస్థల ఆర్థిక వనరులను దోచుకుని అభివృద్ధిని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. మాజీ సీఎం జగన్ పురపాలక సంఘాలకు చెందిన రూ.2 వేల కోట్లను దోచుకున్నారని ఆరోపించారు. రోడ్లకు కూడా మరమ్మతులు చేయించేందుకు నిధులు లేకుండా చేశారన్నారు. స్థానిక సంస్థల సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడుకు విన్నవించినట్లు తెలిపారు. వైకాపా పాలనలో అక్రమ మద్యం, మైనింగ్, ఇసుక రవాణాలో రూ.1.50లక్షల కోట్ల అవినీతి జరిగినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరుగుతోందని చాలా మంది పెద్ద నాయకులు ఉన్నారని త్వరలోనే ఫలితం అనుభవిస్తారన్నారు. రామసముద్రం మండలంలోని గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. మరో రూ.1.50 కోట్ల నిధులు విడుదల చేస్తామన్నారు. మండలంలోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కదిరి రోడ్డు నుంచి బెంగళూరు రోడ్డుకు అనుసంధానంగా బాహ్యవలయరోడ్డు మంజూరైందన్నారు. దీని నిర్మాణం పూర్తయితే పట్టణంలోకి భారీ వాహనాలు, కార్లు రాకుండా నియంత్రించవచ్చని తెలిపారు. తెదేపా మండలాధ్యక్షుడు విజయగౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివశంకర్, ఎన్.విద్యాసాగర్, మోడెం సిద్ధప్ప, జనసేన నాయకురాలు దారం అనిత, మార్కెట్ యార్డు మాజీఛైర్మన్ గుర్రప్పనాయుడు, నాయకులు నాగార్జునబాబు, బాలుస్వామి, సుధాకర్, కత్తి లక్ష్మన్న పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు పరామర్శ



బ్రహ్మపుత్రారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

కూరపర్తి(వాల్మీకిపురం), న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తన కుమారుడు నిఖిలేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని వడ్డిపల్లె, ప్యారంపల్లె, కూరపర్తి, వాల్మీకిపురం పట్టణంలోని నల్లారి అభిమానులు, పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు బ్రహ్మపుత్రారెడ్డి ఇంటికెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం వడ్డిపల్లెలో ఇటీవల మృతిచెందిన చిన్నరామన్న ఇంటికెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. భాజపా జిల్లా కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, అంజికుమార్, రామాంజులరెడ్డి, తెదేపా బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకట్రమణ, తెదేపా మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

వృద్ధుల రక్షణకు చట్టాలు అమలు చేయాలి



నారాయణమూర్తిని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వయో వృద్ధుల రక్షణకు చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి కోరారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీని పునరుద్ధరించాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ సమస్యలపై రచయిత కృష్ణమూర్తి రచించిన, డైరెక్టర్ రాజా తీసిన కనువిప్పు లఘు చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ధనలక్ష్మీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.20వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, గౌరవాధ్యక్షుడు వై.ఎస్.మునిరత్నం, డాక్టర్ గొల్లపుడి తిరుపతి రావు, మహబూబ్‌బాషా, శకుంతలమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న కురబ సంఘం నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆదాయపన్నుశాఖ సహాయ కమిషనర్ యాదగిరి సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కురబ సామాజికవర్గ విద్యార్థులకు కదిరి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం కురబ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్యం చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థికి ఏ వృత్తిపై ఆసక్తి ఉంటుందో దాన్ని ఎంచుకుని ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. కురబసామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఉచితంగా సివిల్స్‌కు శిక్షణ ఇవ్వడంతో పాటు, కెరీర్ గైడెన్స్ గురించి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సన్మానం చేసి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో భారత విమానయాన సంస్థ విశ్రాంత బృంద కెప్టెన్ కె.పరంధామగౌడ్, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వెంకట్రామయ్య, హరికుమార్, కురబసంఘం డివిజన్ అధ్యక్షుడు ఆర్.కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, గౌరవాధ్యక్షుడు కె.నాగరాజు, రుద్రయ్య, దండు రామాంజులు,రెడ్డెప్ప, రమణ, నరసింహులు, మల్లయ్య, సదాశివ, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననికి జన నీరాజనం

దసరా వేడుకలు మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో ఘనంగా ముగిశాయి. భక్తులు అమ్మవారిని పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్ని ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. **- న్యూస్‌టుడే బృందం**



కలికిరిలో పూల పల్లకీలో ఊరేగుతున్న అమ్మవారు



బి.కొత్తకోటలోని అమ్మవారిశాలలో భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు



రామసముద్రంలో వజ్రకవచధారిణిగా వాసవీదేవి



కొత్తపేటలో ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ



బంగారు కిరీటంతో దర్శనమిచ్చిన కోర్టులో గంగమ్మ



నిమ్మనపల్లె బాలినాయునిపల్లెలో రాజరాజేశ్వరిగా చౌడేశ్వరిదేవి

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి



సయ్యద్‌బాషాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని తెదేపా శ్రేణులతో పాటు నల్లారి అభిమానుల కష్టసుఖాల్లో అండగా ఉంటామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, వల్లిగట్ల, రాజేంద్రచారి తదితర నాయకులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన తెదేపా మైనార్టీ నాయకుడు సయ్యద్‌బాషా ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. మండలంలోని వడ్డిపల్లె, ప్యారంపల్లె తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధిత కుటుంబాలతో పాటు తమ అభిమానులు, కార్యకర్తలను పరామర్శించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, తెదేపా నియోజకవర్గ మైనార్టీ నాయకులు సయ్యద్ బాషా, బొక్కసం రామకృష్ణ, నారాయణ, కోసూరి రమేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కంభంవారిపల్లి : ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని వగళ్ల పంచాయతీ నారమాకల వడ్డిపల్లెలో శనివారం రాత్రి జరిగిన దేవరెడ్డుల మహోత్సవం, ఆవుల వేల్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవరెడ్డుల ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సంప్రదాయ పద్ధతిలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. తెదేపా మండలాధ్యక్షురాలు గీతాంజలి, నాయకులు గోపాల్ రెడ్డి, గాలి సుధాకర్ నాయుడు, సూర్యప్రకాష్ రెడ్డి, వెంకట్రమణ నాయుడు, యర్రంరెడ్డి, రవిచంద్రారెడ్డి, కృష్ణయ్య, రామచంద్ర, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి నల్లారి సోదరులు

గుర్రంకొండ: గుర్రంకొండ మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో జరిగిన తెదేపా నేత ఎల్లుట్ల రామాంజులునాయుడు వివాహానికి నల్లారి సోదరులు మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యేకు సత్కారం

కలికిరి: కలికిరి పట్టణం మదనపల్లె మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైరా వస్త్ర దుకాణాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్‌రెడ్డిని వస్త్ర దుకాణ యజమానులు ఎల్లప్ప, అశోక్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గంగమ్మ ఆలయానికి వెండి కిరీటం వితరణ



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

పీలేరు గ్రామీణ : మండల పరిధి తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ ఆలయానికి పీలేరు పట్టణంలోని కడప మార్గంలో నివాసముంటున్న తువ్వపల్లె రెడ్డెమ్మ, సురేంద్రరెడ్డి దంపతులు శనివారం వెండి కిరీటం వితరణ చేశారు. విజయదశమి సందర్భంగా ఆలయ ఛైర్మన్ మల్లికార్జుననాయుడు చేతుల మీదుగా కిరీటాన్ని అందజేశారు.

18 నుంచి సుభహాని ఉరుసు

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువులోని మహబూబ్ సుభహాని ఉరుసును ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు కాలేషా తెలిపారు. కదిరి రోడ్డులోని దర్గా వద్ద ఆదివారం గోడపత్రాలు ఆవిష్కరించారు. 18న దీపోత్సవం, 19న గంధోత్సవం, 20న ఉరుసు, ఖవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు జహీర్, రఫీ, గౌస్, బాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

డాక్టర్ సేతు సేవలు ప్రశంసనీయం



విద్యాసంస్థల అధినేత సేతుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, ప్రముఖులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు మదనపల్లెలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శ్రీనివాస కల్యాణోత్సవాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడంతో పాటు డాక్టర్ ఎన్.సేతుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు మల్లికార్జుననాయుడు, మార్పూరి శశిధర్‌రావు, దేవతా డిజిటల్స్ సతీష్, భాజపా రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, అజంతుల్లాఖాన్, బర్నేపల్లె రవికుమార్, ఆకుల కృష్ణమూర్తి, కిరణ్, భవానీ, సర్పంచి చిప్పిలి చలపతి, విజన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు సాయిశేఖర్‌రెడ్డి, నిర్మల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మస్తాన్, మనోహర్‌నాయుడు, ఆనంద్, విజేత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శంకర్‌యాదవ్, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : దసరా సెలవుల నేపథ్యంలో బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో శని, ఆదివారాల్లో పర్యాటకుల రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కొండపైకి తరలిరావడంతో సందడి నెలకొంది. దసరా సెలవులు మొదలైన తర్వాత క్రమంగా పర్యాటకుల రద్దీ పెరుగుతూ చివరి రెండురోజులు ఒక్కసారిగా పుంజుకుంది. చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి కొండపై అందాలు వీక్షించారు. బెంగళూరు నుంచి యువకులు ద్విచక్రవాహనాల్లో కొండపైకి వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. యువకుల బృందం ఒకేసారి కొండపైకి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. అటవీ, పర్యాటకశాఖల ప్రాంగణాలు సందర్శకులతో కిటకిటలాడాయి.



హార్సిలీహిల్స్ అటవీశాఖ వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలు వీక్షిస్తున్న పర్యాటకులు

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఘనంగా గ్రామోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తితిదే అధికారులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వర సమేత కామాక్షిదేవి వార్లను పల్లకీపై గ్రామోత్సవం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా సంస్థ 1988-93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పుత్తనవారిపల్లె కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మూడు దశాబ్దాల తరువాత అంతా కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. తోటి మిత్రుల అభివృద్ధికి దోహదపడాలని నిర్ణయం తీసుకున్నారు. అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



పుత్తనవారిపల్లెలో గురువులతో పూర్వ విద్యార్థులు

వెండి త్రిశూలం వితరణ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా శనివారం దిన్నెపాడు పంచాయతీ పర్వతరెడ్డిగారిపల్లెకు చెందిన సుదర్శనబాబు దంపతులు అమ్మవారికి రూ.45 వేల విలువ గల వెండి త్రిశూలం వితరణ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీహరి, ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి ఓబులేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త గొర్ల మోహన్‌రెడ్డి, భూదేవమ్మ, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు వెండి త్రిశూలం అందజేస్తున్న దాతలు

కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ప్రసాద్‌బాబు

రాయచోటి : కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయన్ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను తెలియజేసి ఘనంగా సత్కరించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

పాపక్కగారిపల్లెలో మారెమ్మకు పొంగళ్లు

పుల్లంపేట : అనంతసముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లె ఆదివారం మారెమ్మకు స్థానికులు పొంగళ్లు సమర్పించారు. తొలుత మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకుని కానుకలు హుండీలో వేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల భక్తులు తరలి వచ్చారు.

నేడు గంగమ్మ తిరుణాల

సుండుపల్లి : పెద్దినేనికాలువ గ్రామం బూడిదేటివాండ్లపల్లి సమీపంలోని గంగమ్మ తిరుణాల సోమవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం పూజలు, అభిషేకం, రాత్రి చాందినీబండ్ల తిరుణాల జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం మొక్కుబడులున్నవారు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అభిషేకం చేస్తున్న భక్తులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: తిమ్మసముద్రంలోని రామాలయం వద్ద ఆదివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వేదమంత్రాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహాన్ని మాజీ సర్పంచి ఎం.జయరాంనాయుడు కుటుంబం అందజేశారని నిర్వాహకులు తెలిపారు. ఎస్..రవినాయుడు కుటుంబం అన్నదానం చేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

పనులు జరగవు... దాహం తీరదు

ఊతమివ్వని ఊటుకూరు సీపీడబ్ల్యూఎస్ పథకం

రూ.10 కోట్ల ప్రజాధనం వృథా

47 గ్రామాలకు నీరందని వైనం



అలంకారప్రాయంగా మిట్టమీదపల్లి వద్ద నిర్మించిన వాటర్ పంపింగ్ మోటార్లు, పైపులు



చెయ్యేరు వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి బావి

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

మంచినీటి వసతి లేని పల్లెలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో 2017లో అప్పటి ప్రభుత్వం నాబార్డ్ నిధులు రూ.10 కోట్లు కేటాయించింది. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలను గుర్తించి ఊటుకూరు మంచి నీటి పథకం పేరుతో సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని ప్రారంభించింది. రాజంపేట మండలం ఊటుకూరు, పోలి, మందరం, సీతారాపురం, కోల్లావారిపల్లి, మిట్టమీదపల్లి, ఎన్టీఆర్ కాలనీ, చవనవారిపల్లి ఇలా తొమ్మిది గ్రామ పంచాయతీలకు తాగునీరందించాలనే సంకల్పంతో పనులు చేయించింది అయితే.. పథకం పనులు పనులు చేయకుండానే గుత్తేదారు వదిలేసి వెళ్లిపోయారు. దీంతో మంచినీటి వసతి లేక ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు.

● అన్నమయ్య జలాశయంలో నీటి నిల్వలున్న సమయంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేవి. 2021లో వరదల కారణంగా మట్టి కట్ట కొట్టుకుపోవడంతో మంచినీటి కొరత మరింత పెరిగింది. రాజంపేట మండలం మేకవారిపల్లి, కోల్లావారిపల్లి, చవనవారిపల్లి గ్రామాలకు ట్యాంకర్లతో నీరందించే స్థితికి చేరుకుంది.

● కరవు బాధిత గ్రామాలకు నీరందించేందుకు మందరం చెయ్యేరు వద్ద మంచి నీటిబావిని ఏర్పాటు చేసి భారీ పైపులైన్ ద్వారా నీరందించడానిరి ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మందరం కొండ్లోపల్లి, ఊటుకూరు, మిట్టమీదపల్లి, కోల్లావారిపల్లి వద్ద ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. చెయ్యేరులో నిర్మించిన మంచి నీటి పథకం సకాలంలో పూర్తి చేసి ఉంటే ఈ గ్రామాలకు సురక్షత నీరందేది. కానీ ట్యాంకులకు నీరందించే పైపులైను పూర్తి చేయకపోవడంతో పనులు పూర్తి చేయకపోవడంతో ఈ పథకం మధ్యలోనే నిలిచిపోయింది.

● ప్రభుత్వ అధికారులు మాత్రం 90 శాతం పనులు పూర్తి చేశామని చెబుతున్నారు. కేవలం పనులు జరిగినట్లు కాగితాలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పనులు కనబడడం లేదు. అరకొర పనులు చేసి చేసినట్లు చూపుతున్నారు. ముఖ్యంగా ఊటుకూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పైపులైను పూర్తిగా కొట్టుకుపోయింది. అదేవిధంగా మందరం వద్ద, మిట్టమీదపల్లి వద్ద కూడా పైపులైన్ ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా చెయ్యేరు వద్ద నిర్మించిన మంచినీటి బావి, విద్యుత్తు నియంత్రికలు, భారీ మోటార్లు, పైపులు కనిపించకుండా పోయాయి.

● జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. సీడబ్ల్యూఎస్ పథకం పనులు పూర్తి చేసేందుకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరందించే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

తాగేందుకు నీరు లేకుండా చేశారు

అప్పటి తెదేపా ప్రభుత్వంలో ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు మంచి నీరందించడానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించారు. కానీ అధికారులు, వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పట్టించుకోలేదు. దీంతో మా గ్రామ పంచాయతీ పరిధిలోని 12 గ్రామాలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

- చెంగల్‌రాయుడు, ఊటుకూరు


పొలాల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం

మూడేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడం, అన్నమయ్య జలాశయం కట్ట పునర్నిర్మాణం జరగకపోవడంతో తీవ్ర నీటిఎద్దడి ఉంది. ఊటుకూరు మంచి నీటి పథకం వస్తుందని ఏడేళ్ల కిందట మా గ్రామంలో పైపులైన్ ఏర్పాటు చేశారు. కానీ.. ఇంత వరకు ఒక చుక్కనీరు అందించలేదు. నీటి వసతి లేకపోవడంతో గ్రామస్థులు వ్యవసాయ పొలాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

- పత్తిపాటి కుసుమకుమారి, మాజీ సర్పంచి, కోల్లావారిపల్లి

పథకం పేరు	నిధులు మంజూరు	పథకం విలువ	గ్రామ పంచాయతీలు	గ్రామాల సంఖ్య	జనాభా
ఊటుకూరు సీపీడబ్ల్యూఎస్ పథకం	నాబార్డ్ (కేంద్ర ప్రభుత్వం)	రూ.10 కోట్లు	9	47	16,018

గొడుగురాయి... ఆశ్చర్యమేనోయి



మడితాడు గ్రామం పాలకొండల సమీపంలోని పొలాల్లో గొడుగు ఆకారంలో ఉన్న ఓ రాయి చూపరులను ఆకట్టుకుంటోంది. సుమారు ఆరుఎడుగుల ఎత్తు ఉన్న ఈ రాయి కొన్నేళ్ల నుంచి అలానే దర్శనమిస్తోందని గొడుగురాయిగా పిలవబడుతోందని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, సుండుపల్లి**

సమ సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: బలమైన ప్రజాస్వామ్య పునాది ప్రజా సంఘాలతోనే సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో జరుగుతున్న మతోన్మాద అరాచకాలను ఎదుర్కోవడానికి కార్యకర్తలకు సైద్ధాంతికపై అవగాహన అవసరమన్నారు. ప్రతి కార్యకర్త సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

దేవఎద్దుమాలిక నిర్మాణానికి విరాళం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పందిళ్లపల్లె పంచాయతీ కొక్కంటివారిపల్లెలో వెలసిన దేవరెద్దు ఆలయంలో ఎద్దు మాలిగ నిర్మాణానికి ఆదివారం దప్పేపల్లె పంచాయతీ వీరారెడ్డిగారిపల్లెకు చెందిన ముద్దుల రామచంద్ర కొంత నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యలమకూరి విజయభాస్కర్, భాజపా సీనియర్ నాయకుడు కృష్ణ, ముత్తయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

ముగిసిన దసరా శరన్నవరాత్రులు



సుండుపల్లి : ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి



రైల్వేకోడూరులో శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు



చిన్నమండెం : ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి



లక్కిరెడ్డిపల్లె : భక్తులకు దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ



పుల్లంపేట పురవీధుల్లో ఊరేగుతున్న మారెమ్మ



రాజంపేట : వీరచౌడేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు



వీరబల్లిలో అమ్మవారి అలంకరణతో కళాకారిణి



గాలివీడు దుర్గమ్మ ఆలయంలో లడ్డూను రూ.1.26 లక్షలకు వేలంలో సొంతం చేసుకున్న బుర్జుపల్లెవాసులు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అమ్మవారు విజయదుర్గాదేవి, శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. చెడుపై మంచి విజయం సాధించిన రోజున అమ్మవారి కటాక్షం సిద్ధించాలని గుండ ప్రవేశ కార్యక్రమాలు చేపట్టారు. గాలివీడులో అమ్మవారి లడ్డూను రూ.1.26 లక్షలకు బుర్జుపల్లె వాసులు వేలం పాడి సొంతం చేసుకున్నారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



వెంకటరాజంపేటలో పవళింపు సేవలో కనక దుర్గమ్మ



రాయచోటి : పూల పల్లకీలో ఊరేగుతున్న ఉమా మహేశ్వరస్వామి

సభా సంస్థల మాజీ అధ్యక్షుడి విగ్రహావిష్కరణ



పిచ్చయ్య కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న స్థానికులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఎస్‌బీవీడీ సభా సంస్థలకు గట్టి పునాది వేసిన ఏఆర్ పిచ్చయ్య సేవలు అభినందనీయమని ఎస్‌బీవీడీ సభాసంస్థల కరస్పాండెంట్ శ్రీరాములు పేర్కొన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని కుమారుడు అవ్వారు రాజేంద్రప్రసాద్, కల్యాణి దంపతులు ఆవిష్కరించారు. సీతారాంపేటకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పిచ్చయ్య కుటుంబ సభ్యులను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో జానకీరాం, శ్రీహరి, పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

వీరబల్లి : ఆసాదివాండ్లపల్లిలో మట్టి సర్పంచి సోమారపు నాగార్జునాచారి చొరవ చూపి నూతన బోరు వేయించడంతో నీటి సమస్య తీరింది. నీటి సమస్య ఉందని ఉన్న బోర్లలో నీరు అడుగంటి రావడం లేదని గ్రామస్థులు తెలపడంతో తక్షణమే బోరు వేయడానికి బోరుబండిని పంపించి వేయించారు.

‘క్షేత్రస్థాయిలో విచారిస్తే వెలుగులోకి వాస్తవాలు’

వీరబల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల నిధులు దుర్వినియోగంపై క్షేత్రస్థాయిలో విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెదేపా మండల నాయకులు వీరబల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, నాయకులు వై.సురేంద్రారెడ్డి, అమరేశ్వర్‌రాజు, నేతి రమేష్, చలపతి, భాస్కర్‌రాజు అనఆనరు. స్థానిక తెదేపా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సర్పంచులు తాము అవినీతికి పాల్పడినట్లు రుజువు చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు సహకరించి నిరూపించుకోవాలన్నారు. మండల కమిటీ మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, నాయకులు వెంకట్రామరాజు, వీరనాగయ్య, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లెలకు పండగ

రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ.10.40 కోట్లతో 116 పనులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ‘పల్లె పండగ’ కార్యక్రమాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. అందులో భాగంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల పరిధిలో సిమెంటు రోడ్లు నిర్మితం కానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం నిధుల నుంచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేటాయింపులు జరుగుతున్నాయి. వచ్చే వారం రోజుల పాటు ఆయా ప్రాంతాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంటోంది.

■ రైల్వేకోడూరు మండలంలో రూ.4.76 కోట్లతో 36 రోడ్డు నిర్మాణ పనులు చేపట్టబోతున్నారు. మైసూరువారిపల్లెలో ప్రత్యేకంగా జిల్లా మినరల్ ఫండ్స్ నుంచి రూ.30 లక్షల కేటాయింపుతో ఆరోగ్య కేంద్రం నిర్మితమవుతోంది. ఓబులవారిపల్లెలో రూ.2 కోట్లతో 33 పనులు, పుల్లంపేటలో రూ.1.28 కోట్లతో 17 పనులు, చిట్వేలి పరిధిలో రూ.1.50 కోట్లు వెచ్చించి 19 పనులు, పెనగలూరు మండలంలో రూ.86 లక్షలతో 11 పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాలలో చాలా వరకు సిమెంటుదారులు ఏర్పాటవుతాయి. ప్రజల ప్రయాణ సదుపాయాలు మెరుగవుతాయి.



ఇది కొత్తకోడూరు కాలనీకి వెళ్లే దారి. ఇలాంటి దారులన్నీ సీసీ రోడ్లుగా మారబోతున్నాయి

ఈ ఆర్థిక సంవత్సరం లోపే పూర్తి : నేటి నుంచి మొదలయ్యే పల్లె పండగ పనులను ఈ ఆర్థిక సంవత్సరం అంటే వచ్చే ఏడాది మార్చి లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పల్లెల్లో ప్రగతి సాధనకు అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులను భాగస్వాములు చేయాలని సూచిస్తోంది. అందరి సహకారంతో ప్రజలకు వసతులు సమకూరుస్తాం. ప్రతి గ్రామంలోనూ పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- టి.బాలనరసింహులు, పంచాయతీరాజ్ శాఖ డీఈ, రైల్వేకోడూరు

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నందలూరు, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచి కార్యాలయంలో ఆదివారం జరిగిన రైల్వే ఫించనుదారుల కార్యవర్గ ఎన్నికలలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళి, కార్యదర్శిగా పులి నారాయణ, కోశాధికారిగా మాడపురి ఆదినారాయణ, సలహాదారుడిగా రామచంద్రయ్య ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ విశ్రాంత రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అసోసియేషన్ రాజీ లేని పోరాటం చేస్తోందని.. దీనిని మరింత బలోపేతం చేస్తామన్నారు.

గంగమ్మ ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని అనంతపురంలోని గంగమ్మ ఆలయ ఈవో శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లాడుపల్లె ఆలయానికి ఈవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

దారి కాచిన నిర్లక్ష్యం



గాలివీడు నాలుగు వరుసల రహదారిలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద మంచినీటి పథకం నీటి గేట్‌వాల్వ్ రవాణాకు అడ్డంగా మారింది. రోడ్డు విస్తరణ తర్వాత నీటి గొట్టం తొలగించలేదు. ప్రమాదాలు జరుగుతుండటంలో చోదకులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే దాన్ని తొలగించాలని స్థానికుల కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గాలివీడు

జీఎన్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం పీడిత ప్రజాఉద్యమాలకు తీరని లోటని.. ఆయన మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. మండల పరిధిలోని దప్పేపల్లె పంచాయతీ జాండ్రపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడారు. గుండె సంబంధిత సమస్యలతో దిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పదేళ్లు జైలులో ఉంచి క్రూరంగా కేంద్ర ప్రభుత్వం బాధించిందన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్న ఆయన నిర్బంధ కాలంలో ఎలాంటి వైద్య సౌకర్యం కల్పించలేదన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు మహేష్, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న